

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	520.20 (149.6410)	58.578	900
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.45 (3.56)	68.78	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	156.035 (21.215)	నిల్	4,000

చికెన్ ధరలు: లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

పోషకాహార లోపంతో ఎవరూ అనారోగ్యం పాలు కావొద్దన్న ఉద్దేశంతో అంగన్‌వాడీకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా కడుపులో బిడ్డ పడిన దగ్గరి నుంచి పెరిగి పెద్దయి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకూ బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. చిన్నారులతోపాటు వారి తల్లులకు కూడా నాణ్యమైన ఆహారం ఇస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా ఇక నుంచి ముఖ గుర్తింపు విధానాన్ని తీసుకొస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పడనుంది.

- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)



అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్



- నకిలీ లబ్ధిదారుల తొలగింపే లక్ష్యంగా ఫేస్ రికగ్నైజేషన్
- పారదర్శక సేవలకు శ్రీకారం

కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు చెక్ పడనుంది.అవకతవకలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలనుంచి మూడేళ్ల, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలతోపాటు గర్భిణులు, బాలింత మహిళలకు నెలనెల పౌష్టికాహారం అందించే సమయాల్లో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖం ఆధారిత గుర్తింపు)ను తప్పనిసరి చేసింది. కేంద్రాల్లో నకిలీ లబ్ధిదారులను తొలగించి అర్హులైన వారికి మాత్రమే పౌష్టికాహారం అందించి పారదర్శకత పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఈవిధానాన్ని తీసుకొచ్చింది.దీనికోసం ఇప్పటికే పోషణ్ ట్రాకర్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

సెల్‌ఫోన్ ద్వారా ఫేస్ క్యాప్చర్

ఆయా అంగన్‌వాడీకేంద్రాల్లోని లబ్ధిదారులకు సంబంధించిన ఫొటోలు తీసి ఆధార్, కేవైసీ వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. వారికి అందిస్తున్న పోషకాహారం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతీనెల లబ్ధిదారుడు కేంద్రానికి వచ్చిన తర్వాత ముఖ గుర్తింపు హాజరు తీసుకుని ఆహారం పంపిణీచేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ఏ సరుకులు పంపిణీ చేశారో నేరుగా లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు సమాచారం వెళ్లేలా యాప్‌ను రూపొందించారు. తద్వారా పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టేందుకు అవకాశం ఉంది. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం ముఖం ఆధారిత గుర్తింపు

-మిగతా 6వ పేజీలో...

పకడ్బందీగా అమలు చేస్తాం: శైలజ, సీడీపీవో

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేస్తాం. ఈ మేరకు అన్ని కేంద్రాల్లో ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే 70నుంచి 80శాతం పూర్తి చేశాం. ఆధార్ గుర్తింపులో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేసేలా సిబ్బందికి సూచించాం. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విధానంతో పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు మాత్రమే అందే ఆస్కారం ఉంది.



గురుకులాల్లో ఫోన్‌మిత్ర

వివిధ సంక్షేమశాఖలకు చెందిన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇంటిమీద బెంగతో కొంతమేర ఇబ్బందులు పడుతుంటారు. మరికొందరు తల్లిదండ్రులతో ఉన్న అనుబంధం కారణంగా వారితో మాట్లాడలేక, వారిని విడిచి ఉండలేక ఇంటిదారి పడుతుంటారు. కొంత మంది కళాశాలల్లో ఒంటరితనాన్ని భరించలేక, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకుని ఫోన్‌మిత్ర కార్యక్రమానికి ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో శ్రీకారం చుట్టారు. దీంతో విద్యార్థుల్లో భయం పోగొట్టడం, ఇంటిపైన బెంగ నుంచి విముక్తి కల్పించనున్నారు. అందుకోసం యాక్సిస్ బ్యాంకుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా, గురుకుల కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రకారం ఫోన్లు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట (కలెక్టరేట్)



సూర్యాపేట బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటుచేసిన ఫోన్ ద్వారా మాట్లాడుతున్న విద్యార్థినులు

- ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు
- ప్రతీ విద్యార్థికి స్మార్ట్‌కార్డ్
- ఫోన్‌మిత్రతో విద్యార్థుల్లో తొలగనున్న ఇంటిబెంగ

ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఫోన్‌మిత్ర పథకాన్ని ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మొదటగా హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి గురుకులంలో ఏర్పాటు చేయగా, సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలోని ఎనిమిది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 'ఫోన్‌మిత్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఒక్కో గురుకుల కళాశాలలో 640 మంది విద్యార్థులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో ఐదు బాలికల, మూడు బాలుర ఎస్సీ గురుకులాలు ఉండగా, ఈ గురుకులాల్లో మొత్తం 5వేల మందికిపైగా విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు.

స్మార్ట్‌కార్డ్‌లో ముందుగానే ఫోన్ నెంబర్లు



గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసించే ప్రతీ విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ అందించారు. అందులో ముందుగానే విద్యార్థి తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒకరి ఫోన్ నెంబరుతో పాటు గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి నెంబర్‌ను ముందుగానే ఫీడ్ చేశారు. విద్యార్థులు స్మార్ట్‌కార్డ్ ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం ఉంటుంది. ఫోన్లు చేసినందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. గురుకులాల్లోని ప్రతీ 100మంది విద్యార్థులకు ఒక ఫోన్ చొప్పున ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రతీ రోజు వారికి అవసరం అనుకుంటే సాయంత్రం కళాశాల తరగతులు ముగిసిన అనంతరం 4.30 నుంచి రాత్రి 7గంటల వరకు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసుకునే అవకాశం ఉంది. గతంలో క్లాస్‌టీచర్ (హౌస్ పేరెంట్ టీచర్) ఫోన్ ద్వారా మాత్రమే ఎప్పుడో ఒకసారి అత్యవసరం అనుకుంటే మాత్రమే ఫోన్ సదుపాయం ఉండేది. ఇప్పుడు ప్రతీ రోజు మాట్లాడుకునే అవకాశం కల్పించారు. అదే విధంగా కళాశాలల్లో ఏమైనా సమస్యలు ఉన్నా వెంటనే గురుకులాల రాష్ట్ర కార్యదర్శికి

- మిగతా 6వ పేజీలో...

నేడు మాజీ సీఎం రోశయ్య జయంతి

కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి (కలెక్టరేట్), జూలై 3 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఏపీ మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలను నేడు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒకప్రకటనలో తెలిపారు.కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాలతో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను కూడా నిర్వహిస్తున్నామని, బీసీ సంఘాలు ఇతర కులసంఘాల నాయకులు, ప్రజలు హాజరుకావాలని తెలిపారు.

నేడు భువనగిరి మునిసిపల్ కమిషనర్‌తో 'ఫోన్‌ఇన్'



భువనగిరి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మునిసిపల్ కమిషనర్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ నిర్వహించనుంది. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులు, మురుగుకాల్వలు, సీజనల్ వ్యాధులు, వందరోజుల ప్రణాళిక, పనుల కోసం మునిసిపల్ కార్యాలయానికి వస్తున్న వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర సమస్యలపై శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు. ఫోన్ చేయాల్సిన నెంబర్ 9392205913.

ఓటింగ్ నమోదు శాతం పెంచాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

బొమ్మలరామారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్ నమోదు శాతం పెంచాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు నమోదు చేసుకునే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా బోగస్ ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. స్థానికంగా నివాసం ఉండే ప్రతీఒక్కరికి ఓటుహక్కు కల్పించాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఓటుహక్కు నమోదు చేయించడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అలాంటి వారికి ఓటుహక్కుపై అవగాహన కల్పించి జాబితాలో నమోదు చేసుకునే విధంగా చూడాలన్నారు. అవసరమైతే పదో తరగతి పూర్తయిన విద్యార్థుల జాబితాను ఆయా పాఠశాలల నుంచి తీసుకొని వారి పుట్టిన రోజు ఆధారంగా ఓటు నమోదు చేయాలన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో 90శాతంపైగా పోలింగ్ జరిగిందని, అదే మాదిరిగానే స్థానిక ఎన్నికల్లో కూడా పోలింగ్ శాతాన్ని పెంచే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్స్ ఉపాధ్యాయులు, పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ లేకుండా చూడాలి..

రాజాపేట: భూభారతి దరఖాస్తుల పెండింగ్ లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. రాజాపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ అనితను అడిగి తెలుసుకున్నారు.

వివిధ పనుల పై కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంటశాల, డైనింగ్, స్టోర్ రూంలను, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఆర్ఐ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ ఉన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో పేదలకు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టి సూక్యతండ(పెద్దతండ), బాబుల్ నాయక్ తండ, ధర్మారం, ముల్కలపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు, బీల్యానాయక్ తండలో ఎస్టీ కమ్యూనిటీ, దత్తాయపల్లిలో గౌడ కమ్యూనిటీ హాల్, మల్కాపూర్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గుజ్జవానికుంటలో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపనచేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో కుల భవనాలకు అధిక ప్రాధాన్యమిస్తూ సీడీపీ నిధులను మంజూరుచేసి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే పేదలకు సన్న బియ్యం ఇస్తున్న చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నెరవేరుస్తూ నూతన రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నామన్నారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బీల్యానాయక్ తండనుంచి కర్లగడ్డ వరకు చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. మండలంలోని బాబుల్‌నాయక్‌తండ, ధర్మారం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. తుర్కపల్లి మండలం దత్తాయపల్లిలో గౌడసంఘం కమ్యూనిటీహాల్ శంకుస్థాపన సందర్భంగా కల్లు తాగి, కాసేపు గీత కార్మికులతో ముచ్చటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆలేరు మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనావతు శంకర్‌నాయక్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు ధనావతు మోహన్‌బాబు, కానుగంటి శ్రీనివాస్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ పట్టు నాయక్, నాయకులు ధనావతు భాస్కర్‌నాయక్, వెంకన్న, బోరెడ్డి హన్మంతరెడ్డి, భూక్య రాజారాం నాయక్, దేవరుప్పల అయిలయ్య పాల్గొన్నారు.

హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్‌సీ డీడీ కమిషనర్ క్షితిజ



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ క్షితిజ

భువనగిరి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్‌సీడీడీ (షెడ్యూల్డ్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్) కమిషనర్ క్షితిజ అన్నారు. గురువారం రాత్రి భువనగిరిలోని ఎస్సీ బాల బాలికల కళాశాల, సాధారణ వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. హాస్టళ్ల నిర్వహణ, భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కుటుంబాలకు దూరంగాఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్‌కోసం శ్రమించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థినుల వినతిమేరకు త్వరలోనే డిక్షనరీలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ నిర్వహణ, విద్యార్థులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట డీడీ రమాదేవి, డీఎస్‌సీడీవో శ్యాంసుందర్ ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం

కలిగిస్తే చర్యలు

డీసీపీ అక్షాంశ్ యాదవ్

చౌటుప్పల్ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ అక్షాంశ్ యాదవ్ హెచ్చరించారు. గురువారం చౌటుప్పల్ మునిసిపాలిటీ, తంగెడపల్లిలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 61 బైకులు, ఆటో, కారు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిస కావొద్దని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 3 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసి, బాలల హక్కులను కాపాడాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం అమలుపై పోలీసు శాఖ, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో బడికి రాని పిల్లలు, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి, పాఠశాలలో తిరిగి చేర్పించాలన్నారు. 14 ఏళ్లలోపు బాలలు కార్మికులుగా పని చేస్తున్నట్లు గుర్తిస్తే యజమానులపై కేసులు నమోదుచేస్తామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ బృందం, కార్మిక శాఖ అధికారులతో కలిసి కంపెనీలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేసి బాల కార్మికులను గుర్తించాలన్నారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి నర్సింహారావు, ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, డీఈవో సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ, బాల రక్షా కోఆర్డినేటర్ అనంతలక్ష్మి, సీడీపీవోలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో భవిత కేంద్రాలు, కస్తూర్బా విద్యాలయాల వసతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయాల్లో ప్రత్యేక అధికారుల భాగస్వామ్యంతో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ ఎస్.ప్రశాంత్‌రెడ్డి, ఈడబ్ల్యూడీసీ ఈఈ శైలజ, డీఈఈ శివకుమార్, ఏఈలు, విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఆలేరు: వార్డు ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆలేరు మునిసిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా స్థానిక మునిసిపల్ కార్యాలయ సమీపంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ



ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న డీఈవో

వలిగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో 2024-25 విద్యాసంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి మాట్లాడారు. తాము చదువుకున్న పాఠశాల విద్యాభివృద్ధికి చేయూత నిస్తున్న పూర్వ విద్యార్థుల సేవలను కొనియాడారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి కాసుల మిలిందకు రూ.10వేలు, ద్వితీయ ర్యాంకు సాధించిన రాపోలు ఇందు ప్రియకు రూ.5వేలతోపాటు పలువురికి నగదు పురస్కారాలను అందజేశారు. అదే విధంగా మండలంలోని అరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంగారెడ్డిపల్లి గ్రామ విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు బుస్స శంకరయ్య వారి కుమారులు రమేష్, నాగరాజు సౌజన్యంతో సైకిళ్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో సుంకోజు భాస్కర్, విజయలక్ష్మీ, రాజబాబు, పూర్వ విద్యార్థులు గోళ్ల అనిల్‌కుమార్, గూడూరు రాణి, సింగిరెడ్డి అనిత, ఎస్. లింగయ్య, అభయ ఆస్పత్రి చైర్మన్ సుంకోజు చంద్రమౌళి, ఉపాధ్యాయులు మల్లేశం, జిలానీ, లక్ష్మీ, నాగిరెడ్డి, సైదారెడ్డి, గోపి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల పనితీరు భేష్

బీబీనగర్‌లో త్రిపుర బ్యాంకర్ల బృందం

బీబీనగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల పనితీరు బాగుందని త్రిపుర బ్యాంకర్ల బృందం కితాబిచ్చింది. సంఘాల పనితీరును అధ్యయనం చేసేందుకు బీబీనగర్‌కు వచ్చిన బృందం సభ్యులకు ఎన్ఐఆర్‌డీ కోఆర్డినేటర్ అభిషేక్, అదనపు డీఆర్‌డీవో కోట జంగారెడ్డి స్వాగతం పలికారు. బృందం సభ్యులు మండలకేంద్రంలో పర్యటించి బీబీనగర్ సమాఖ్య భవన్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామసంఘాలు మండల సమాఖ్య సభ్యులతో సమావేశమయ్యారు. సంఘాల నిర్వహణతోపాటు బ్యాంకు లింకేజీ రుణాలు, వాటి సద్వినియోగం తదితర అంశాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. సంఘాలు సాధిస్తున్న ఆర్థిక అభివృద్ధిని త్రిపుర బృందం ప్రశంసించింది. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.ప్రభాకర్, వెంకటేశ్, బాలరాజు, రవీందర్, శ్రీనివాస్, మల్లేశ్, సీసీలు శ్రీలత, నర్మద, మల్లేశ్, సమాఖ్య అధ్యక్షురాలు ప్రజావాణి పాల్గొన్నారు.



త్రిపుర బ్యాంకర్ల బృందానికి స్వాగతం పలుకుతున్న మహిళా సంఘం సభ్యులు

కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఈ నెల 14న తిరుమలగిరిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ సన్నాహక సమావేశం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా దివాళా తీయించారన్నారు. ఈ నెల 14న తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సీఎం సభకు పెద్దఎత్తున అన్ని గ్రామాల నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహా, సింగిల్ విండో చైర్మన్ తాల్లూరి మురళి, జిల్లా కార్యదర్శి గూని వెంకటయ్య, నాయకులు వేముల గోపీనాథ్, నోముల రవి కుమార్, బొల్లికొండ గణేష్, బోడ అరుణ్ కుమార్, షేక్ ఇబ్రహీం, బందెల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ నిధులతోనే చండూరులో పనులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి

చండూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : చండూరు పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులేనని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా చండూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఒక్కరూపాయి అభివృద్ధి జరగలేదన్నారు. ఆ పార్టీ వారి అవినీతిని ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు పెడుతోందని, తాజాగా చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ ఇల్లు కూల్చి వేశారన్నారు. తమ కార్యకర్తలపై అక్రమకేసులు బనాయించి ఓట్లు వేయించుకుందామని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అరాచకాలకు అడ్డులేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్, పెదగోని వెంకన్న, కురుపాటి సుదర్శన్, తేలుకుంట్ల చంద్రశేఖర్, తేలుకుంట్ల జానయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాచరిక, రాక్షసపాలన



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రాచరిక, రాక్షస పాలన కొనసాగుతోందని, ప్రశ్నించేవారిపై కేసులు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్‌వ్యవస్థను ఉపయోగించి గ్రామాల్లో ప్రశ్నించిన నాయకులపై కేసులు పెడుతూ కాంగ్రెస్ నాయకులు భయాందోళనకు గురిచేస్తున్నారు. తాము ఉద్యమం నుంచి వచ్చామని, ఇవి కొత్తేమి కాదని, ఎలాంటి కేసులకైనా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇక నుంచి ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అయితగోని వెంకన్నగౌడ్, మాజీ అధ్యక్షులు కట్టా వెంకటరెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజలాల్ శేఖర్ బాబు, దుబ్బ వెంకన్న, జేరిపోతుల చంద్రమౌళి, అక్కినేపల్లి శ్రీరాములు, భూపతి ఉపేందర్, శేషరాజపల్లి వెంకన్న, పాక రాములు, మహేశ్వరం వెంకన్న, గుండ్ల వెంకన్న, చిపుట సైదులు, రాపాక రాజు, నిమ్మల సురేష్, తీగల వెంకన్న, రాచకొండ గణేష్, కమలాకర్, చీమల శ్రవణ్ కుమార్, నోముల శ్రీనివాస్, చింతల శంకర్, జలందర్, బడేసాబ్ తదితరులు ఉన్నారు.

చేనేత రుణమాఫీ!

● ప్రస్తుతం రూ.లక్ష లోపు రుణాలకే ● రూ.33 కోట్లు మంజూరు ● ఉమ్మడి జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం ● కార్మికుల్లో ఆనందోత్సాహాలు

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు శుభవార్త అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రుణమాఫీని అమలుచేస్తూ, ఈ పథకం కోసం రూ.33 కోట్లు విడుదల చేసింది. దీంతో చేనేత కార్మికులకు గొప్ప ఆర్థిక ఊరట లభించింది. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న కార్మికులందరికీ లబ్ధి చేకూరనుంది. రాష్ట్రవాప్తంగా 6,600 మంది చేనేత కార్మికులు ప్రయోజనం పొందుతుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

చేనేత కార్మికులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. కార్మికులను రుణవిముక్తులను చేస్తూ 2025-26 బడ్జెట్ నుంచి రూ.33కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలకే మాఫీ వర్తిస్తుంది. చేనేత వృత్తిపై తీసుకున్న రుణాలు, చేనేత వస్త్రాల ఉత్పత్తికి, వృత్తి సంబంధ కార్యకలాపాలు, ముద్ర రుణాలన్నింటికీ మాఫీ కానున్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఆయా బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 1,162 మంది చేనేత కార్మికులకు రూ.8.04 కోట్ల రుణమాఫీ జరుగనుంది. వీరితోపాటు మరో 1,560 మంది రూ.లక్షకు పైగా రుణాలు తీసుకున్నారు. వీరికి సైతం రూ.15.60 కోట్లు రుణమాఫీ వర్తించనుంది. యాదాద్రి-భువనగిరి జిల్లాలో మొత్తం 2,722 మంది కార్మికులకు రూ.23.64కోట్ల రుణవిముక్తి లభించనుంది. అయితే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి మొత్తం 604 మంది చేనేత కార్మికులకు రూ.3.04 కోట్ల రుణమాఫీ కానుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,326 మంది చేనేత కార్మికులకు రూ.26.68 కోట్ల రుణమాఫీ జరుగనుంది.

చేనేత రుణమాఫీపై సర్కారు తిరకాసు!

చేనేత రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తిరకాసు పెడుతోంది. అసలుకే మాఫీ చేసి, మిత్తికి మంగళం పాడేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు చేనేత రుణమాఫీపై జరుగుతున్న కసరత్తులో ఈ విషయం వెల్లడైంది. దీంతో రూ.లక్ష లోపు రుణాలు పొందిన చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల నుంచి పొందిన రుణంలో అసలు రూ.లక్ష వరకు మాత్రమే మాఫీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు సమాచారం. అసలుపై పెరిగిన వడ్డీని రుణగ్రహీత తిరిగి బ్యాంకులకు చెల్లిస్తేనే రుణం పొందిన అసలు సొమ్ము మాఫీ జరుగుతుందని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఉదాహరణకు ఒక కార్మికుడు బ్యాంకు నుంచి రూ.90వేలు రుణం తీసుకుంటే దానికి వడ్డీ రూ.25 వేలు అయింది. అసలు వడ్డీ కలిపితే రూ.1.15 లక్షలు అవుతుంది. అయితే బ్యాంకు నుంచి పొందిన రుణం రూ.90వేలకు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని సమాచారం. వీడ్డ మొత్తం రూ.25వేలు కార్మికుడు చెల్లించాల్సి ఉంటుంది. మిగతావారికి కూడా అసలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుండగా, వడ్డీ కార్మికులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏదేమైనా ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేయడంపై కార్మికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నేరుగా ఖాతాల్లోనే జమవుతాయి



రూ.లక్షలోపు ఉన్న రుణాలున్నవార ందరికీ రుణమాఫీ అవుతుంది. రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్న రుణమొత్తాన్ని చెల్లిస్తే వారికి రుణమాఫీ వర్తిస్తుంది. రూ.లక్షలోపు రుణం ఉన్నవారికి గడువులో చెల్లించిన వారికి ప్రయోజనకరం. రుణమాఫీ డబ్బులు నేరుగా చేనేత కార్మికుల ఖాతాలో జమవుతాయి.

శ్రీనివాస్‌రావు, చేనేత, జౌళిశాఖ ఏడీ, యాదాద్రిజిల్లా

రుణవిముక్తి కలగనుంది



మూడేళ్ల క్రితం కెనరాబ్యాంకులో రూ.2లక్షలు రుణం తీసుకున్నా. గతేడాది వరకు కిస్తులు కట్టా. ప్రస్తుతం అసలు, వడ్డీ కలుపుకుని రూ.1.90 లక్షల రుణం ఉంది. అయితే రూ.లక్ష మాఫీ చేస్తే రుణవిముక్తి కలుగుతుంది. నాలాగే కార్మికులను రుణవిముక్తులను చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

భోగ గణేష్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

రాజుకు ఇల్లు మంజూరు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
● ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్న ఆశతో ఉన్న ఇంటిని కూల్చుకున్న నల్లగొండ శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బట్ట రాజుకు ఎమ్మెల్యే మందుల సామేల్ ఇల్లు మంజూరు చేశారు. కమ్యూనిటీ హాల్‌లో ఉంటున్న రాజు దీనస్థితిపై ఈ నెల 3న ఆంధ్రజ్యోతి పత్రికలో మాటలు నమ్మి, గూడూ తీసేశాడు శీర్షికన కథనం ప్రచురితమైంది. గురువారం శాలిగౌరారంలో ఓ సభకు హాజరైన ఎమ్మెల్యే ఈ కథనాన్ని చదివి రాజుకు ఇల్లు చేయాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మిని ఫోన్‌లో ఆదేశించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపించాలన్నారు. వెంటనే రాజు కుటుంబ సభ్యులు ఎంపీడీవో జ్యోతిలక్ష్మి వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలను తెలిపారు.

'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన రాజు

తన కుటుంబ సభ్యుల బాధను వెలుగులోకి తీసుకువచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కారణమైన 'ఆంధ్రజ్యోతి'కి రాజుతో పాటు భార్య రమణ, కుమార్తెలు నాగశ్రీ, భవ్యశ్రీలు కృతజ్ఞతలు తెలిపారు.


10న బుద్ధవనంలో ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవం



బుద్ధవనంలో ఏర్పాటుచేసిన శిష్యులకు బోధనలు చేస్తున్న బుద్ధుడి శిల్పాలు

నాగార్జునసాగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో ఈ నెల 10న గురుపౌర్ణమి సందర్భంగా ధర్మప్రవర్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం ముఖ్యఉద్దేశం సిద్ధార్థుడు మొదటిజ్ఞానోదయ సందేశ రోజు అన్నారు. తాను నేర్చుకున్న సత్యాన్ని మొదటిసారిగా శిష్యులైన కొండన్న, మహనామా, పప్పా అప్పాజీ, బాధియాలకు మధ్యప్రదేశ్ రాష్ట్రం సారనాథ్ జింకల వనంలో తెలియజేసిన(ఉపన్యసించిన) రోజు బుద్ధుడి జీవితంలో ముఖ్యమైన ఐదు ఘట్టాలల్లో ఒకటన్నారు. బుద్ధుని మొదటి ఉపన్యాసాన్ని ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవంగా బౌద్ధులు నిర్వహించుకుంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 10న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ ఘట్టం

యాదగిరిగుట్ట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను అలంకరించి గజవాహనసేవ చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి కల్యాణతంతు కొనసాగించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో నిత్యపూజలు, యాగశాలలో నిత్యరుద్రహవనం జరిపించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,95,642 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో యాదాద్రిభువనగిరి జిల్లాలో కూలి, సూర్యాపేటలో ఎలక్ట్రీషియన్, నల్లగొండ జిల్లాలో రైతు ఉన్నారు.

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఏగూరి సుధాకర్(30) గాంధీఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం ఏగూరి స్వరూప కుటుంబం సుమారు 20 ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం మండలంలోని సదర్శాపురం నుంచి మోత్కూరు వచ్చి ఇక్కడే నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్దకుమారుడు హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. స్వరూప ఇళ్లలో పనిచేస్తుండగా చిన్నకుమారుడు సుధాకర్ బ్యాండ్ మేళం వాయించేవాడు. జూన్ 27న సుధాకర్ క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ ...



బిచ్చానాయక్(ఫైల్)

పాలకవీడు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ గురువారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సైదులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సఫావత్ బిచ్చా నాయక్(45) మీగడంపాడుతండాలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగుస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రూపావత్ కోట్యా పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు సరిచేసేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బిచ్చానాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కస్తూరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారని ఏఎస్ఐ సైదులు తెలిపారు.

నేరడలో మూర్ఛతో ఊపిరాడక రైతు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

చిట్యాల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వచ్చిన వ్యక్తి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలో గురువారం జరిగింది. ఎస్ఐ మామిడి రాములు తెలిపిన వివరాల ప్రకారం నేరడకు చెందిన వడ్డెపల్లి సైదులు(40) వ్యవసాయం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. రోజువారీగా పొలంలో పనులు చేస్తూ మూర్ఛతో కిందపడిపోయాడు. పొలంలో ఉన్న బూడిదలో పడిపోగా ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్లిన రైతులు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. సైదులు భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి జైలు

కోదాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అప్పు కింద చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కోదాడ ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడకు చెందిన కొదుమూరి ప్రవీణ్ నుండి రంగాపురపు ఉమామహేశ్వర్ తన అవసరాల నిమిత్తం అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని ప్రవీణ్ కోరగా ఉమామహేశ్వర్ 2014లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంక్‌లో చెల్లకపోవడంతో ప్రవీణ్ కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణల అనంతరం కేసును విచారించిన ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ భవ్య గురువారం తీర్పు వెలువరించారు. ఇచ్చిన చెక్కు తాలూకా రూ.5లక్షలు ఇవ్వాలని, చెల్లని చెక్కు ఇచ్చినందుకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న సూర్యాపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తేలిందన్నారు. వారిని గురువారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగిలిన ఐదుగురికి రూ.6500 జరిమానా విధించినట్లు తెలిపారు.

దాడి కేసులో నిందితులకు జరిమానా

నిడమనూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైజన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం 2016 ఆగస్టు 31న మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన గుడిపాటి లక్ష్మమ్మ తన పశువులకు గడ్డి కోసేందుకు పొలం వద్దకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన గుడిపాటి నవీన్, గుడిపాటి సైదయ్య, గుడిపాటి వెంకమ్మ అనే ముగ్గురు పొలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా గెట్టు పంచాయితీని దృష్టిలో పెట్టుకొని దుర్భాషలాడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు అదేరోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ యాలాద్రి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించనిపక్షంలో నిందితులు నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ సైదులు కేసు విచారణకు సహకరించారని లైజన్ అధికారి తెలిపారు.

భూతగాదాల్లో ఘర్షణ, ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో భరత్

పెన్‌పహాడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల కుటుంబాల మధ్య భూవివాదం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఎస్ఐ గోపీకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం భక్కాయిగూడెం గ్రామానికి చెందిన శానం వెంకటేశ్వర్లు, రామలింగయ్య అన్నదమ్ములు. వారికి పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. తరచూ సరిహద్దు వివాదాలు జరుగుతున్నాయి. పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టినా వివాదం సమసిపోలేదు. గురువారం రామలింగయ్య కుమారుడు భరత్, భార్య కళమ్మ, శానం వెంకటేశ్వర్లు, ఆయన కుమారులు నాగేంద్రబాబు, లక్ష్మణ్‌రావులు పొలం గెట్ల వద్ద ఘర్షణపడ్డారు. ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో భరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శానం వెంకటేశ్వర్లు కుమారులు నాగేంద్రబాబు, లక్ష్మణ్‌రావులు నల్లగొండ 12వబెటాలియన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భరత్ తల్లి కళమ్మ ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీకృష్ణ తెలిపారు.

అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో...	
కేంద్రాలు	901
బాలింతలు	3,429
గర్భిణులు	4,511
ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు	21,890
3-6 ఏళ్ల చిన్నారులు	19,535

హాజరు తప్పనిసరి చేశారు. దీంతో కేంద్రాలకు ఎంత మంది వచ్చారో సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీసి కార్యకర్తలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

కేంద్రాల్లో కొనసాగుతున్న ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుంది. జిల్లాలో మొత్తం 901 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, మొత్తం 49,365 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఆరు నెలల నుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు 70నుంచి 80శాతం వరకు ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ పూర్తయింది. గర్భిణులు, బాలింత మహిళలకు పోషన్ ట్రాకర్ అప్లికేషన్‌లో ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుంది. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. మరికొన్ని రోజుల్లో ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా లబ్ధిదారులకు ఆహారం అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరుస్తాం



ఎఫ్ఆర్ఎస్ ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల ఆదేశాలతో లబ్ధిదారుల ఫొటోలను క్యాప్చర్ చేసి వారి ఆధార్‌తో లింక్ చేస్తున్నాం. ఈకేవైసీతోపాటు లబ్ధిదారులకు అందిస్తున్న ఆహారపు వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో పొందుపరుస్తున్నాం.

పి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, బీబీనగర్



సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోన్లు

గురుకులాల్లో ఫోన్‌మిత్ర

(5వ పేజీ తరువాయి)

కూడా ఫోన్‌లో విషయాలను తెలిపే అవకాశం కల్పించారు.

విద్యార్థులకు తొలగనున్న ఇంటిబెంగ

గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసి ఫోన్‌మిత్ర ద్వారా విద్యార్థుల్లో ఉండే ఇంటిబెంగ తొలగిపోతుంది. చాలా మంది విద్యార్థులు ఇంటి మీద బెంగపెట్టుకుని విద్యపై సరిగా దృష్టి సారించలేక ఇబ్బందులు పడుతుంటారు. అదే విధంగా మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులతో దూరంగా ఉన్నామనే భావన ఉంటుంది. ఇంకా కొంత మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఫోన్‌మిత్ర ద్వారా ఇలాంటి సమస్యలకు చెక్‌పడనుంది. వారి తల్లిదండ్రులతో రోజూ మాట్లాడుతుండడం వల్ల మానసికంగా బాగుంటారు. అంతేగాక ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. దీంతో పాటు విద్యార్థుల డ్రాపవుట్స్ కూడా తగ్గనున్నాయి.

'ఫోన్‌మిత్ర' విద్యార్థులకు ఉపయోగకరం



గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఫోన్‌మిత్ర కార్యక్రమం విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. విద్యార్థినులు రోజువారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుకోవడంతో ఎలాంటి ఇబ్బందులకు గురికావడం లేదు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకుంటున్నారు. ఫోన్‌మిత్ర ద్వారా ఇంటిమీద బెంగపోయింది. విద్యార్థినులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటున్నారు. దీంతో విద్యపై దృష్టి సారిస్తున్నారు.

సీహెచ్.పద్మ, ప్రిన్సిపాల్, బాలికల గురుకుల కళాశాల దురాజ్‌పల్లి, సూర్యాపేట


shanthi TALKIES
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA
DINESH KRISHNAN B & JITHIN STANISLAUS
AMRIT RAMNATH
GANESH SIVA
R. SIBI MARAPPAN
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA
PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REALD 3D
Dolby Cinema
FILMED FOR IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES MUSIC
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి: ఎస్‌ఐ

భువనగిరి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు, దొంగతనాల నివారణకు నిందితుల గుర్తింపునకు సీసీ కెమెరాల ఏర్పాటుకు డాక్యుమెంట్ రైటర్స్ సహకరించాలని భువనగిరి పట్టణ ఎస్‌ఐ బి.కుమారస్వామి అన్నారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్స్‌కు గురువారం ఆయన అవగాహన కల్పించారు. సమాజ హితం కోసం తమ వంతు బాధ్యతను నిర్వహించాలని, ఇందుకు స్వచ్ఛందంగా స్పందించాలని డాక్యుమెంట్ రైటర్స్‌కు సూచించారు.

నేడు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొనసాగుతున్న నూతన లైన్ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ సాయికృష్ణ తెలిపారు. వినాయకచౌరస్తా, ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల, ఓల్డ్ బస్టాండ్, శృతినగర్, సంతోష్‌నగర్, పెంటాజీనగర్, రాఘూర్‌రోడ్, గంజ్ ఆర్బీనగ్, సంజీవ్‌నగర్, హనుమాన్‌వాడ తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రేషన్ కార్డుల పంపిణీ చరిత్రలో నిలుస్తుంది

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలో ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మోత్కూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 మాసాల్లోనే అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇస్తోందన్నారు. సీఎం తుంగతుర్తి నియోజకవర్గంలో రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించనుండటం నియోజకవర్గ ప్రజలకే గర్వకారణమన్నారు. గత ప్రభుత్వం అప్పులు నెత్తిన పెట్టిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మొదట కొంత ఇబ్బంది పడిందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు గాడిన పడిందని, ఇక సంక్షేమ పథకాలన్నీ అమలు జరుగుతాయన్నారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగత కోపం లేదని, పార్టీ, ప్రభుత్వం కోసం అందరూ కలిసిపనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న అసెంబ్లీ నియోజకవర్గాల డీలిమిటేషన్‌లో మోత్కూరు నియోజకవర్గమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన రేషన్ కార్డుల పంపిణీని నియోజకవర్గంలో ప్రారంభిస్తున్నందున అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్ పర్సన్ నూనెముంతల విమలవెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.సమీర్, పోచం జగన్, నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, చింతల విజయభాస్కర్‌రెడ్డి, అన్నెపు పద్మ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల బండరాయి మీద పడి మృతి చెందిన నాగుల్ మీరా ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందించారు. కాశవాడలో ఇంటిలోపల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆయన పరిశీలించి ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. ఆ స్తంభాన్ని తొలగించి వేరే చోట నాటడానికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి డబ్బులు ఇస్తానని లేక ఇచ్చినా స్తంభం తొలగించక పోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎస్ఈ దృష్టికి తీసుకువెళతానన్నారు.



మోత్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

బహిరంగసభకు తరలిరావాలి: ఎమ్మెల్యే

అడ్డగూడూరు: సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈనెల 14న జరిగే సీఎం బహిరంగసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 14వ తేదీన తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారని, ఈ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మనగోటీ జోజి, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరక్టర్లు బాలెంల విద్యసాగర్, చిత్తాలూరి సోమన్న, నాయకులు ఇటికాల చిరంజీవి, పాశం సత్యనారాయణ, గుండీగ జోసఫ్, పూజారి నర్సయ్య గౌడ్, కన్నె బోయిన గంగరాజు, బాలెంల సైదులు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భువనగిరి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు మునిసిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని భువనగిరి మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 32వ రోజు గురువారం స్థానిక 1, 5, 6, 15, 16వ వార్డులలో నిర్వహించిన పారిశుధ్య పనులకు ప్రజలు సహక రించాలన్నారు. రహదారులను, మురికి కాలువలను, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని శుభ్రం చేశారు. మురికి గుంతలలో ఆయిల్‌బాల్స్ వేశారు. ఇళ్లలోని నిరుపయోగ పాత్రలు, వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని అన్నారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ జల్లాలుద్దీన్, హెల్త్ అసిస్టెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లకు సమస్యలపై అవగాహన ఉండాలి

యాదగిరిగుట్ట రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని వార్డు ఆఫీసర్లకు వారికి కేటాయించిన వార్డుల్లో సమస్యలపై పూర్తి అవగాహన ఉండాలని యాదగిరిగుట్ట మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని 4, 8, 9, 11వ వార్డుల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు వాటిని తమ రిజిస్టర్లలో నమోదు చేసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. వార్డు ఆఫీసర్లు వార్డుల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటరి ఇన్స్‌పెక్టర్ సురేందర్‌గౌడ్, దండు కిరణ్‌బాబు, మేనేజర్ శారద, అకౌంటెడ్ రజిని, మాజీ కౌన్సిలర్లు సీసీ విజయలక్ష్మీకృష్ణగౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

యాదగిరిగుట్ట రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగపల్లి స్వామి వివేకానంద కళాశాలలో గురువారం ఆఫ్టివల్ హెల్త్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్‌ప్లస్ ఆధ్వర్యంలో హెచ్ఆర్ మేనేజర్ ఎండీ తాజుద్దీన్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చివరి సంవత్సరం చదువుతున్న 52మంది విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా స్కిల్, రాత పరీక్ష, వ్యక్తిగత మౌఖిక పరీక్షలు నిర్వహించారు. వారి సర్టిఫెకట్లు పరిశీలించి 27మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల డైరెకర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి అర్హత పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హెమమాలిని, కె.రాజిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపి వేయించాలి



నాలా ప్రాంతంలో అక్రమకట్టడాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని 13వ వార్డులో నాలాను ఆక్రమించి చేపడుతున్న అక్రమ కట్టడాలను తక్షణమే నిలిపి వేయించాలని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన డిమాండ్ చేశారు. నాలా ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలను గురువారం కడారి కల్పన ఆధ్వర్యంలో బీజేపీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ, నాలాలో బోర్ వేసి ఇరు వైపుల ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, గతంలోనూ ఇదే ప్రాంతంలో చేపట్టిన అక్రమ కట్టడాలను కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు తొలగించారని ఆమె తెలిపారు. అక్రమ కట్టడాలతో నాలా నుంచి ఊర చెరువు అలుగు నీరు ముందుకు వెళ్లలేక పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆమె అన్నారు. ఇదే వార్డులోని ఫైర్ స్టేషన్ సమీపంలో కాంగ్రెస్ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలను చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, బోరు కూడా వేశారని ఆమె వివరించారు. నాలాతో పాటు ప్రభుత్వ భూమిని రక్షించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామనగోని శంకర్, మండల రూరల్ అధ్యక్షుడు కె. అశోక్, నాయకులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పి.శ్రీధర్ బాబు, ఉబ్బు బిక్షపతి, పబ్బు వంశీ, వనం ధనుంజయ్య, ఇ.దామోధర్‌రెడ్డి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

భువనగిరి గంజ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తున్నారని అన్నారు. 2014 నుండి అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం అనేక ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లల పెంటయ్య, గంగాదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, జిల్లా అధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, పౌల్, సురుపంగ స్వామి, శ్రీనివాసచారి, కుమార్, కుమారి పాల్గొన్నారు.

నీటి నాణ్యతను పరీక్షించాలి

మోత్కూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాటర్ ప్లాంట్లలో ప్యూరిఫైడ్ వాటర్ నాణ్యతను పరీక్ష చేయించాలని వినియోగదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. హోటళ్లలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల్లో వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బంది వివరాలతో బోర్డులు పెట్టించాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ సతీష్‌కుమార్ ప్యూరిఫైడ్ వాటర్ నాణ్యత, హోటళ్లలోని పదార్థాల నాణ్యతను ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ పరిశీలించాల్సి ఉంటుందని, ఆయన దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పేర్లతో బోర్డులు త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

బాటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): రైతుల బాటను ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు దయ్యాల నర్సింహ, పల్లెర్ల అంజయ్య కోరారు. గురువారం మండలంలోని జమ్మాపూర్ గ్రామ శివారులో కబ్జా చేసిన బాటను వారు రైతులతో కలిసి పరిశీలించారు. దాదాపు 30మంది రైతుల 70ఎకరాల భూమికి ఉన్న బాటను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని ప్రహరి గోడ నిర్మాణం చేపడుతూ, బాటను మూసివేస్తున్నారన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ అంజిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారదర్శకంగా బాట సర్వేను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దులాపురం వెంకటేశ్, యాదగిరి, వెంకటేశ్, రైతులు లూతియాన, ఆరోగ్యం, రాజు, ఆగప్ప, ఆంటోని, బాలస్వామి పాల్గొన్నారు.

100లీటర్ల కల్తీపాలు స్వాధీనం

● వ్యాపారి అరెస్ట్



వ్యాపారినుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీపాలు

భూదాన్‌పోచంపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామంలో ఓ పాల వ్యాపారి పాలను కల్తీ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కనుముకుల గ్రామానికి చెందిన కుంభం రఘు అనే వ్యక్తి చుట్టు పక్కల గ్రామాలనుంచి పాలను సేకరిస్తాడు. 50లీటర్ల వరకు రైతులనుంచి సేకరిస్తాడు. హైదరాబాద్‌కు తన సొంత వాహనం ద్వారా పాలను తరలించి, అపార్ట్‌మెంట్లలో విక్రయిస్తాడు. ఈ క్రమంలో గురువారం కృత్రిమ పాలను తయారు చేస్తుండగా అతని వద్ద 100 లీటర్ల పాలు, 200 మిల్లీ లీటర్ల ద్రావణం, నాలుగు పాల పౌడర్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కల్తీ పాలు తయారు చేస్తుండగా అతన్ని అరెస్టు చేశామని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

భువనగిరి (కలెక్టరేట్), జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈనెల 4వ తేదీన జరిగే కాంగ్రెస్ పార్టీ సభను విజయవంతం చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరవుతున్న సభపై గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. గత పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని పట్టించుకోలేదని, నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా మారిందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు డిపాజిట్లు దక్కకుండా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్న భువనగిరి నియోజకవర్గంలోని మహాలక్ష్మి మహిళలందరూ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కాంగ్రెస్ అభిమానులు ప్రజలందరూ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

● మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి



చౌటుప్పల్‌లో ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చౌటుప్పల్ మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి కోరారు. ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం చౌటుప్పల్ పట్టణంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ట్రినిటీ విద్యా సంస్థల విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, మూగ జీవాల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్న కొన్ని ప్లాస్టిక్ సం చులు, ఇతర వస్తువులను ప్రభుత్వం నిషేధించిందని ఆయన అన్నారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ సంచులను వినియోగించకూడదని, వాటికి బదులుగా జూట్ బ్యాగులు, వస్త్రాలతో తయారుచేసిన సంచులు, పేపర్ కవర్లను వినియోగించాలని ఆయన కోరారు. ప్రధానంగా వ్యాపార సంస్థల్లో నిషేధిత ప్లాస్టిక్ సంచులను వాడకూడదని, ఒక వేళ వాడితే జరిమానాలను విధిస్తామని ఆయన హెచ్చరించారు. విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ తో వాతావరణం దెబ్బ తినడంతో పాటు ప్రాణి కోటికి ముప్పుగా మారుతోందని ఆయన అన్నారు. మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ టి.రఘుపతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, టీఎంసీ కవిత, ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలో జాగ్రత్తగా ఉండాలి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

భువనగిరి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణలో బీఎల్ఓలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో కృష్ణారెడ్డి అన్నారు. ఓటరు జాబితా సవరణపై గురువారం భువనగిరిలో బీఎల్ఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరమే నూతన ఓటరు నమోదు, సవరణ, తొలగింపు, బదిలీ, ఫొటో మార్పిడి తదితర సవరణలను చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున బల్కుగా వచ్చే ఫారాలు, ఒకే వ్యక్తి పెద్ద మొత్తంలో ఇచ్చే ఫారాలపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిస్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులందరూ ఓటరు జాబితాలో చేరేలా చైతన్యపరచాలని అన్నారు. తహసీల్దార్ అంజిరెడ్డి, రిసోర్స్ పర్సన్స్ నర్సిరెడ్డి, నరేందర్‌రెడ్డి, చిత్తరంజన్, బిక్షం, సంజీవరెడ్డి అవగాహన కల్పించారు.

అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు పెంటయ్య, నగేష్, వెంకటేశం

రామన్నపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వేగవంతం చేసి, అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు సకాలంలో రేషన్ కార్డును అందివ్వాలని అన్నారు. అధికారులు భూభారతి పేరుతో గ్రామాల్లో తిరగడం మూలంగా దరఖాస్తుదారులు పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. దరఖాస్తుకు స్పందించిన తహసీల్దార్ సెక్షన్ అధికారులను పిలిచి సమీక్షించి వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గసభ్యుడు బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, మండల కమిటీ సభ్యుడు ఎండీ.రషీద్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రవణ్ పాల్గొన్నారు.

జూనోసిస్‌పై అవగాహన

రాజాపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జూనోసిస్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రేబిస్ వ్యాధి నివారణకోసం ప్రతిజ్ఞచేశారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, ఆంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ, నివారణ, జాగ్రత్తలు తదితర అంశాలపై మండల పశువైద్యాధికారి ఎం.చంద్రారెడ్డి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రాజాపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండల కేంద్రంలో వినాయక ఫౌండేషన్, నెమిల కేదారి సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌గౌడ్,ప్రభాకర్,నవీన్,స్వామి,మహేశ్,భరత్ తదితరులు పాల్గొన్నారు.

పాల సంఘం చైర్మన్‌గా దామోదర్‌రెడ్డి

రామన్నపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనంపల్లి పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బండ దామోదర్‌రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరక్టర్లుగా మేడషైన కృష్ణ యాదవ్, బండ పులేందర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. సిరిపురం పాల సంఘం చైర్మన్‌గా సీపీఎంకు చెందిన సిల్వేరు వెంకటయ్య చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

యువకుడికి పాముకాటు

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామంలో చిల్లర ప్రశాంత్‌ను గురువారం పాము కాటు వేసింది. పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా నీటిలో ప్రశాంత్‌ను పాము కాటు వేసింది. అతడికి మోత్కూరు పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని మోత్కూ రు పీహెచ్‌సీ డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. వర్షాకాలం అయినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు, రేపు బాలనరసింహ స్వామి ఉత్సవాలు

చౌటుప్పల్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 10 వ వార్డులోని బాలనరసింహ స్వామి దేవాలయంలో ఈ నెల 4, 5 వ తేదీలలో రెండవ వార్షిక మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 4వ తేదీన గణపతి పూజ, స్వస్తి వాచనం, మంటపారాధన, అభిషేకం, నవగ్రహ, మూలమంత్ర హోమం, మంత్ర పుష్పం, 5 వ తేదీన గణపతి పూజ, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది.

'హరీష్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి'

బొమ్మలరామారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌నేత తన్నీరు హరీష్‌రావు యాదగిరిగుట్ట పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పోలగాని వెంకటేష్‌గౌడ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం, గిరిప్రదక్షిణ, అనంతరం నిర్వహించే కార్యకర్తల సమావేశానికి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమానికి కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాలనర్సయ్య, మల్లేష్, కట్ట శ్రీకాంత్, పెద్దులు రమేష్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలి : సీపీఐ

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీలో పెద్దమ్మతల్లి ఆలయం నుంచి శ్మశాన వాటిక ముందు నుంచి బిక్కేరు వాగు వరకు సీసీరోడ్డు నిర్మించాలని సీపీఐ, మండల, పట్టణ కార్యదర్శులు అన్నెపు వెంకట్, బోయిని ఉప్పలయ్య డిమాండ్ చేశారు. దారి బురదమయం కావడంతో సీపీఐ ఆధ్వర్యంలో బురద మడుగు వద్ద నిరసన తెలిపారు.



బురద గుంత వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వాసం నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో చిరువ్యాపారులు, కొత్తబస్టాండు ఆటో కార్మికులు, మోటారు మెకానిక్‌లు, కొందరు రైతులు కలిసి అతని దహన సంస్కారాలకు రూ.36,021 అందజేశారు. కార్యక్రమంలో బోడ బాబూరావు, బొడ్డుపల్లి వెంకన్న, పసుల శ్రీను, కౌకుంట్ల మధు, కొడూరి రాములు, చుక్క యాదయ్య పాల్గొన్నారు.

13న సీపీఐ మండల మహాసభ

చౌటుప్పల్ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 13 వ తేదీన నిర్వహించే సీపీఐ 7వ మహాసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బి.గాలయ్య కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పైలాన్ పార్కులో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యతతో ఇళ్లు నిర్మించుకోవాలి: ఎంపీడీవో

భువనగిరి రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): లబ్దిదారులు ఇందిరమ్మఇండ్ల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో నిర్మించుకోవాలని భువనగిరి ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, మండల హౌసింగ్ ఏఈ రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆలేరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా నిర్వహించారు. నాయకులు .కనకయ్య. రవి, ప్రవీణ్, పరుశరాములు, భవాని, ఉపేందర్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఇవ్వాలి

భూదాన్‌పోచంపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, నేడు అదే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని, వెంటనే ఇవ్వాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) భూదాన్‌పోచంపల్లి పట్టణ కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామశివారులోని ఇంజనీరింగ్ కాలేజీలు బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ముత్యాలు, లావణ్య, దీప్తి, లక్ష్మీనారాయణ, మహేందర్ రెడ్డి, సాయిగణేష్, లోకేష్, శేఖర్‌రెడ్డి, గణేష్, మౌనిక పాల్గొన్నారు.

మోత్కూరు జడ్పీహెచ్ఎస్‌కు 151 కొత్త అడ్మిషన్లు

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో కొత్త అడ్మిషన్లు వచ్చాయి. గురువారం నాటికి 151 మంది విద్యార్థులు కొత్తగా తమ పాఠశాలలో చేరారని హెచ్ఎం టి.గోపాల్‌రెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి ప్రైవేటు పాఠశాల నుంచి మోత్కూరు జడ్పీహెచ్ఎస్‌కు వచ్చిన విద్యార్థికి 151వ అడ్మిషన్‌ను ఆయన అందించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమష్టి కృషి, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయం సాధించామన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

అడ్డగూడూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.రేపాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిప్పలపల్లి ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం ముత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం బాధిత కుటుంబనికి రూ, 20వేలు ఆర్థికసాయం అందజేశారు.